RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 48 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 22 నవంబర్ 2024

## గత ఏపీ సర్కార్ కు చుట్టుకుంటోన్న
# అదాని వ్యవహారం



### సోలార్ విద్యుత్ కొనుగోలుకు భారీ డీల్ కు యత్నం!!

2లో


ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నం

అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ వెల్లడి

## మిషన్ రాయలసీమను
# సాకారం చేస్తాం...!

### ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్

- అసెంబ్లీ తీర్మానాన్ని హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం.
- లోకాయుక్త, హెచ్ఆర్సీ కార్యాలయాల తరలింపు ఉండదు...
- యువగళం హామీ మేరకు మిషన్ రాయలసీమను సాకారం చేస్తాం.
- సీమ అభివృద్ధికి గత ప్రభుత్వం చీమంత కృషి కూడా చేయలేదు.
- మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారు.
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21: ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించారు. ఇప్పటికే ఈ అంశంపై కేబినెట్ ఆమోదించిందని, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. హైకోర్ట్ బెంచ్ ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిన అనంతరం చంద్రబాబు మాట్లాడారు. గత ప్రభుత్వం రాయలసీమకు చీమంత మేలు కూడా చేయలేదని విమర్శించారు. యువగళంలో ప్రకటించిన విధంగా మిషన్ రాయలసీమ హామీలను నెరవేర్చుతామని స్పష్టం చేశారు. "రాష్ట్ర సమగ్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం. గతంలో చేశాం... మళ్లీ చేసి చూపిస్తాం

మిగతాది 2లో...




2లో

## మూడు నెలల పింఛన్ ఒకేసారి తీసుకోవచ్చు

పింఛన్ పంపిణీలో ఏపీ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల


## కర్నూలులో హైకోర్టు బెంచ్
# ఏర్పాటు చారిత్రాత్మకం.!



- మాటలు కాదు చేతల ప్రభుత్వమే ఎన్డీఏ ప్రభుత్వ ఘనత.
- మూడు రాజధానుల పేరుతో గత ప్రభుత్వం మూడు ముక్కలాట.
- రాయలసీమను అన్ని రంగాలలో అగ్ర భాగాన నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం.
- రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.
- హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రిఫరూక్.
- కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీ, మండలి లో ఏకగ్రీవ తీర్మానం.

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21: ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధాని, రాయలసీమ ప్రాంత ముఖద్వారం కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ను ఏర్పాటుకు శాసనసభ,శాసనమండలిలో ఏకగ్రీవ తీర్మానం చేసి గౌరవ రాష్ట్ర హైకోర్టు ద్వారా కేంద్రానికి ప్రతిపాదన పంపుతుండడం చారిత్రాత్మకమని రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.గురువారం శాసనసభ సమావేశాలలో భాగంగా ప్రభుత్వం వివిధ తీర్మానాలను ప్రవేశపెట్టడం జరిగింది. ఇందులో అత్యంత కీలకమైన, కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తూ న్యాయ శాఖ మంత్రిగా ఎన్ ఎం డి ఫరూక్ శాసనసభ, శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు.

మిగతాది 2లో...



2లో

## ఏపీ పీఏసీ చైర్మన్ ఎన్నిక ఆసక్తికరం

ఏపీ పీఏసీ చైర్మన్ గా జనసేన ఎమ్మెల్యే రామాంజనేయులు?

బరిలో దిగిన టీడీపీ ఎమ్మెల్యేలు


జనసేన నుంచి సింగిల్ గా పులపర్తి రామాంజనేయులు

బలం లేదని తెలిసీ వైసీపీ నుంచి నామినేషన్ వేసిన పెద్దిరెడ్డి

పదో తరగతి పరీక్షలు

## తెలుగులోనూ రాసుకోవచ్చు

కీలక నిర్ణయం తీసుకున్న ఏపీ విద్యాశాఖ



2లో

## మన్ కీ బాత్ తరహాలోనే ఏపీలో వినూత్న కార్యక్రమం

### ప్రజలతో నేరుగా మాట్లాడనున్న ముఖ్యమంత్రి

### సంక్రాంతి నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21:

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ తరహాలోనే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రజలతో నేరుగా మాట్లాడనున్నారు. సంక్రాంతి నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం దీనిపై చర్చలు జరుగుతున్నాయి. ఆయన హయాంలోనే 1995 నుంచి 2004 మధ్య డయల్ యువర్ సీఎం నిర్వహించారు. ఇప్పుడు మన్ కీ బాత్, డయల్ యువర్ సీఎం కార్యక్రమాల కలయిక ద్వారా ప్రజలతో మమేకం అయ్యేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. త్వరలోనే ప్రజలతో ముఖా ముఖి సమావేశాలు నిర్వహించనున్నట్లు అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆడియో గానీ వీడియో విధానంలో గానీ ఈ కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉంది.

## విశాఖ కాలుష్యంపై మండలిలో ఆందోళన

### కాలుష్య నివారణకు చర్యలు చేపడతాం

### సభ్యులకు హామీ ఇచ్చిన డిప్యూటీ సిఎం



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21: విశాఖపట్నంలో కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాసన మండలి సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. విశాఖ కాలుష్య నివారణకు, పరిశ్రమల నిర్వాహకులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కాలుష్య నివారణ చేపడతాం. పలాస జీడిపప్పు తొక్క కాల్చడం ద్వారా కూడా పెద్ద ఎత్తున కాలుష్యం వెలువ డేది.. కానీ, ఇప్పుడు ఆ జీడిపప్పు తొక్క ద్వారా ఆయిల్ సేకరించి ఆదాయం సమకూర్చుతున్నామని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలలో కాలుష్యానికి కారణమయ్యే బొగ్గు వాడకాన్ని కూడా తగ్గిస్తున్నామని పవన్ కల్యాణ్ తెలిపారు.అయితే, కొన్ని దశాబ్దాలుగా పరిశ్రమల అభివృద్ధితో విశాఖలో కాలుష్యం పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రత్యేక ప్రణాళిక ద్వారా, విశాఖను కాలుష్యానికి దూరంగా ఉంచేలా ప్రయత్నిస్తాం అని అన్నారు. గత ప్రభుత్వం కాలుష్య నివారణకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అయితే, తమ ప్రభుత్వం గాలిలో నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. కాలుష్యం ఏ అభివృద్ధికి అయినా ఆటంకం కలిగిస్తోంది. కాలుష్యం లేని అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చారిత్రాత్మకం.!

(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమను అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలుపుతామన్న సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీకి కట్టుబడి అధికారంలోకి వచ్చిన ఐదు నెలల వ్యవధిలోనే హైకోర్టు బెంచ్ ని కర్నూల్ లో ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ లో ఆమోదముద్ర వేసిన వెంటనే శాసనసభ,శాసనమండలిలో కూడా తీర్మానంను ప్రవేశపెట్టి ఆమోదించడం రాయలసీమ ప్రజలందరిలో సంతోషం వెల్లివిరుస్తున్నదని అన్నారు. కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు పై ఏకగ్రీవ తీర్మానాన్ని గౌరవ రాష్ట్ర హైకోర్టు ద్వారా కేంద్రానికి పంపి అతి త్వరలోనే బెంచ్ ఏర్పాటయ్యేలాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు మంత్రి అన్నారు. రాయలసీమలోని ఉమ్మడి కర్నూల్, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి హైకోర్ట్‌లో దాఖలైన కేసులు కర్నూల్ లో ఏర్పాటు చేయనున్న హైకోర్టు శాశ్వత బెంచికి కేటాయించబడతాయని తద్వారా ఇప్పటివరకు న్యాయ సేవల్లో ఉన్న కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.

ఏపీ రాష్ట్ర మొత్తం జనాభా దాదాపు 5 కోట్లు ఉండగా, అందులో రాయలసీమలో 1.60 కోట్ల మంది ఉన్నారని పేర్కొన్నారు.రాష్ట్ర విస్తీర్ణంలో 43% విస్తీర్ణం రాయలసీమ కలిగి ఉందని, రాష్ట్ర మొత్తం జనాభాలో 32 శాతం మంది రాయలసీమ జిల్లాల్లో జనాభా వున్నారని అన్నారు.దేశంలో ఇప్పటికే 7 రాష్ట్రాల్లో హైకోర్ట్ బెంచ్‌లు ఏర్పాటై కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.ఈ తరహాలోనే ఆంధ్రప్రదేశ్ లో కూడా న్యాయ పరిపాలన సౌలభ్యం కోసం హైకోర్టు శాశ్వత బెంచ్ ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత కీలకమైన ప్రజాభిష్టాన్ని నెరవేర్చేందుకు నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

**కేంద్రానికి హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానం**

ఎన్నికలకు ముందు రాయలసీమ ప్రజానీకానికి చంద్రబాబు ఇచ్చిన హామీల ను అమలు చేయడంలో భాగంగా కర్నూలు లో హైకోర్టు శాశ్వత బెంచ్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోడమే కాకుండా వేగంగా బెంచ్ ఏర్పాటుకు సన్నాహాలను ప్రారంభించడం, శాసనసభ, శాసనమండలిలో తీర్మానించి కేంద్రానికి పంపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లో పర్యటించినప్పుడు న్యాయవాదులు హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై తెలుపగా, అధికారంలోకి వచ్చిన వెంటనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఆనాడు నారా లోకేష్ హామీ ఇచ్చారని ఫరూక్ గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడలో హైకోర్టు ఏర్పాటైన విషయం అందరికీ తెలిసిందేనని అయితే రాయలసీమ జిల్లాల నుంచి నుంచి నేరుగా రాజధానికి వచ్చేందుకు రవాణా సౌకర్యం సరిగ్గా లేని పరిస్థితులు కారణంగా ఇప్పటివరకు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కర్నూలు లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తో న్యాయపరమైన సేవలు రాయలసీమ ప్రజల చెంతకు చేరనున్నాయని అన్నారు.హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై తీర్మానాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా రాయలసీమ వాసిగా రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హోదాలో శాసనసభ, శాసనమండలి లో ప్రవేశపెట్టడం, అందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

2014-2019 టిడిపి ప్రభుత్వం హయాంలో కర్నూల్ లో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ,2019 లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మూడు రాజధానులు,కర్నూల్ ను న్యాయ రాజధాని అంటూ ప్రగల్బాలు పలికి రాయలసీమ ప్రాంత ప్రజలను మభ్య పెట్టారని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ధ్వజమెత్తారు. ఐదేళ్ల లో గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, 30 ఏళ్లు వెనక్కి నెట్టిందని విమర్శించారు.ఏపీలో అన్ని రాజ్యాంగ వ్యవస్థలను భ్రష్టు పట్టించి అరాచక పాలన సాగించిన ఘనత గత ప్రభుత్వానిదేనిని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను కక్ష సాధింపుతో ప్రజా వేదికను కూల్చడం నుంచి రివర్స్ టెండరింగ్ పేరుతో పనులన్నింటినీ నిలిపివేసి, వేధింపుల రాజకీయాలకు గత ప్రభుత్వం పాల్పడిందని ధ్వజమెత్తారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత ప్రభుత్వం పై, విరక్తితో కూటమికి రాష్ట్ర ప్రజలంతా తిరుగులేని మెజార్టీ ఇచ్చి, జగన్ పార్టీకి కేవలం 11 సీట్లను ఇచ్చి రాష్ట్ర ప్రజానీకం తిరుగులేని విధంగా ఓటుతో బుద్ధి చెప్పి సాగనంపారని అన్నారు. కర్నూలును న్యాయ రాజధాని అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెట్టిన గత ప్రభుత్వానికి రాయలసీమ ప్రజలు కూడా తిరుగులేని విధంగా ఓటుతో బుద్ధి చెప్పి సాగనంపారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా, అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందన్నారు.ఐదేళ్ల గత ప్రభుత్వ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తో కేవలం 150 రోజులలోనే రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనకు చర్యలు, పాలనాపరమైన విధానంలో సమగ్ర మార్పులు చూసిన రాష్ట్ర ప్రజలంతా తాము తీసుకున్న నిర్ణయానికి సార్థకత లభించిందని సంతోషంగా ఉన్నారని అన్నారు.ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధాని కర్నూలుకు పూర్వ వైభవం రానున్నదని,హైకోర్టు బెంచ్ ని ఏర్పాటు చేయడాన్ని సీమ ప్రాంత ప్రజలందరూ స్వాగతిస్తున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.రాయలసీమ జిల్లాల న్యాయపరమైన కేసుల కోసం కర్నూల్ లో ఏర్పాటు అవుతున్న హైకోర్టు శాశ్వత బెంచ్ కారణంగా కష్టాలు తొలగనున్నాయని, కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని నిరూపణ అయిందని రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# మిషన్ రాయలసీమను సాకారం చేస్తాం.

(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమగా ఎడారిగా మారుతుందని ఆలోచించి కృష్ణా జలాలను సీమకు తరలించాలని ఆలోచించింది ఎన్టీఆర్. ఇందులో భాగంగానే తెలుగుగంగ, హంద్రీనీవా, నగరి గాలేరు ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించారు. వాటిని పూర్తి చేసేది కూడా ఎన్డీయేనే. నదుల అనుసంధానం చేసి, పోలవరం పూర్తి చేసి గోదావరి నీళ్లను బనకచర్లకు తీసుకెళితే గేమ్ ఛేంజర్ అవుతుంది. కియా పరిశ్రమను తీసుకొచ్చేందుకు ఏడాదిలోనే గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేశాం. కియా రాకతో అనంత జిల్లా ముఖచిత్రం మారిపోయింది. హార్టికల్చర్ అభివృద్ధి చేస్తే మహర్దశ వస్తుంది. సీమలోనూ మంచి రోడ్లు వచ్చాయంటే టీడీపీ హయాంలోనే. రాయలసీమలో విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. తిరుపతిని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చుతున్నాం. తిరుపతి ఐఐటీ, ఐసర్, కర్నూలులో ట్రిపుల్ ఐటీ, ఉర్దూ యూనివర్సిటీ, అనంతపురంలో సెంట్రల్ వర్సిటీ పెట్టి ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చాం. హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు 90 శాతం రాయితీతో డ్రిప్ సబ్సీడీ ఇచ్చాం... కానీ గత ప్రభుత్వం దాన్ని కూడా రద్దు చేసింది. మళ్లీ రాయితీతో డ్రిప్ ను రైతులకు అందిస్తాం. తిరుపతి హార్డ్ వేర్ హబ్ గా మారింది టీడీపీ హయాంలోనే.

కేంద్రం రెండు ఇండస్ట్రియల్ పార్కులు ఇస్తే వాటిని కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేశాం. వీటి అభివృద్ధికి రూ.5 వేల కోట్లు మంజూరయ్యాయి. ఓర్వకల్లును డ్రోన్ హబ్ గా మార్చేందుకు 300 ఎకరాలు కేటాయించాం. కర్నూలను బెస్ట్ సిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని వివరించారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తెలుగులోనూ రాసుకోవచ్చు

## కీలక నిర్ణయం తీసుకున్న ఏపీ విద్యాశాఖ

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21:

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాశాఖ తీపికబురు చెప్పింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి సౌలభ్యాన్ని అనుసరించి తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్షలు రాసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ మేరకు తెలియజేస్తూ విద్యాశాఖ ప్రకటన జారీ చేసింది. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో విద్యార్థులు మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవచ్చని, ఇప్పటికే దరఖాస్తులు సమర్పించిన వారు కావాలంటే ఐచ్ఛికాన్ని మార్చుకోవచ్చని సూచించింది. గత ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 6 తరగతుల విద్యార్థులను ఒకేసారి ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతూ 2020-21లో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.అయితే ఆంగ్ల మాధ్యమం అమలుపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైనందున 'ఇంగ్లిష్ మీడియం' అని వాడకుండా 'ఒకే మాధ్యమం' ఉండాలని కోర్టు ఆదేశించారు. అనధికారికంగా ఆంగ్ల మాధ్యమమే అన్నట్లు వ్యవహరించారు. దీంతో ఒక్కో తరగతి ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతున్నట్లు ప్రకటిస్తూ, పదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు రాయాలనే నిబంధన పెట్టారు. ఒకే మాధ్యమం అమలు చేయాలని చెప్పడం మినహా ఏ మాధ్యమం అనేది కోర్టు స్పష్టంగా చెప్పకపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో చాలా పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించారు. ఇలా తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులు తెలుగులో పరీక్షలు రాసేందుకు అవకాశం ఇవ్వాలంటూ ప్రధానోపాధ్యాయులు కోరడంతో కూటమి సర్కార్ ఈ ఒక్క ఏడాదికి అనుమతివ్వాలని నిర్ణయం తీసుకుంది.ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి చదువుతున్న విద్యార్థులు 6.20 లక్షల మంది ఉన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ నామినల్ రోల్స్‌లో 4.94 లక్షల మంది విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నమోదు చేశారు. ఇందులో 39 వేలకుపైగా విద్యార్థులు తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాస్తారని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమం అమలవుతున్నట్లు రికార్డుల్లో నమోదు చేసింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరేగా ఉంది. విద్యార్థులకు ద్విభాష పాఠ్యపుస్తకాలు ఇస్తున్నందున చాలాచోట్ల తెలుగులోనే పాఠాలు చెబుతున్నారు. ఇక విద్యార్థులు కూడా మాతృభాషలోనే చదువుతున్నారు. ఒకేసారి తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మార్పు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పదో తరగతికి వచ్చిన తెలుగు మీడియం పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాయాలంటే ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించిన విద్యాశాఖ ఈ ఏడాదికి తెలుగు మీడియంలో పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అవకాశం ఇచ్చింది. పబ్లిక్ పరీక్షల ఫీజును నంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించేందుకు అవకాశం ఉంది.

## గత ఏపీ సర్కార్ కు చుట్టుకుంటోన్న

# అదాని వ్యవహారం

## సోలార్ విద్యుత్ కొనుగోలుకు భారీ డీల్ కు యత్నం!!

### ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నం

### అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ వెల్లడి



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21:

దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన ఓ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. సోలార్ విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన ఓ భారీ డీల్ కుదుర్చుకునేందుకు.. ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్- ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది.ఈ వివాదాస్పద వ్యవహారం క్రమంగా.. ఆంధ్రప్రదేశ్ గత సర్కార్ కు చుట్టుకుంటోంది. 2019- 2024 మధ్య అధికారంలోని ప్రభుత్వంతో గౌతమ్ అదానీ.. ఈ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నడిపినట్లు అమెరికా విచారణ సంస్థ ఎఫ్‌బీఐ పరిశోధనలో వెల్లడైంది. ఇందుకోసం.. దాదాపు రూ.1,750 కోట్లు చేతులు మారినట్లు అమెరికా విచారణ సంస్థ.. ఆ దేశ కోర్టుకు సమర్పించిన ఫైలింగ్ లో వెల్లడించింది.లాభదాయకమైన సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు రూ. 2.029 కోట్లు లంచం ఇచ్చినందుకు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీ, మరో ఆరుగురు వ్యక్తుల ప్రయత్నించినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో మరింత లోతైన దర్యాప్తు చేపడతామని ప్రకటించిన అమెరికా విచారణ సంస్థ.. ప్రాథమిక నివేదికను కోర్టుకు అందించింది. ఈ కుట్రలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తి సహకారం ఎక్కువగా ఉందన్న ఎఫ్‌బీఐ.. తేదీలతో సహా వారి మధ్య భేటీలను వెల్లడించి, ఆశ్చర్యపరిచింది.భారత్ లో అతిపెద్ద సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకునేందుకు గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సహా మరో ఆరుగురు.. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వజూశారని అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ ఆరోపిస్తోంది. అయితే.. ఈ ఒప్పందాలను చూపించి బ్యాంకులు, ఇన్వెస్టర్లను తప్పుడు సమాచారంతో మోసం చేసి నిధులు సమీకరించేందుకు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఇందులో అమెరికా ఇన్వెస్టరు సైతం ఉండడంతో.. తమ దేశ పెట్టుబడిదారుల్ని మోసం చేస్తున్నారన్న కారణంతో అమెరికా దర్యాప్తు ప్రారంభించింది. ఈ దర్యాప్తునకు సంబంధించిన అంశాలను తెలుపుతూ.. కోర్టులో ఎఫ్‌బీఐ ఫైలింగ్ చేసింది. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు.. అదానీ గ్రీన్ ఎనర్జీ గ్రూప్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల సహకారం కోరిన అదానీ, ఇతర నిందితులు.. ప్రతిగా భారీగా లంచాలు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా.. భారత ప్రభుత్వంలోని వ్యక్తులకు రూ.2,029 కోట్లు లంచంగా ఇచ్చేందుకు ప్రయత్నించారని ఎఫ్‌బీఐ నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకునే ఒప్పందాలతో అదానీ గ్రీన్ ఎనర్జీ, దాని అనుబంధ సంస్థలకు పెద్ద మొత్తంలో లాభం చేకూరుతుందని పేర్కొంది.అలాగే.. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం ( కుదుర్చేందుకు అదానీ స్వయంగా ప్రయత్నించారు. ఇందుకోసం.. అతను ఆంధ్రప్రదేశ్ లోని అత్యున్నత స్థాయి కార్యనిర్వాహక వ్యక్తిని కలిశారు అని అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ స్పష్టంగా వెల్లడించింది. ఇక్కడే అసలు విషయం పూర్తిగా వెల్లడైంది. అమెరికా విచారణ సంస్థ తేదీలతో సహా తెలిపినట్లుగా..2021లో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. నాడు విద్యుత్ సరఫరా ఒప్పందాలపై చర్చలు జరిగినట్లు ప్రభుత్వం తెలపగా.. దాదాపు ఏడు మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ముఖ్యమంత్రి జగన్ అంగీకారం తెలుపారు. ఇది.. భారత్ లోని మరే ఇతర రాష్ట్రాలు చేసుకోలేనంత భారీ ఒప్పందంగా.. అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వెల్లడించింది.

# ఏపీ పీఏసీ చైర్మన్ ఎన్నిక ఆసక్తికరం



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21:

ఏపీ పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) చైర్మన్ గా ఎవరు? అంటూ జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పీఏసీ చైర్మన్ గా ఎన్నికవడం లాంఛనమేనని తెలుస్తోంది. పీఏసీ చైర్మన్ పదవికి టీడీపీ తరఫున శ్రీరాం రాజగోపాల్ (జగ్గయ్యపేట ఎమ్మెల్యే), బీవీ జయనాగేశ్వరరెడ్డి (ఎమ్మిగనూరు ఎమ్మెల్యే), అరిమిల్లి రాధాకృష్ణ (తణుకు ఎమ్మెల్యే), అశోక్ రెడ్డి (గిద్దలూరు ఎమ్మెల్యే), బూర్ల రామాంజనేయులు (పత్తిపాడు ఎమ్మెల్యే), నక్కా ఆనంద్ బాబు (వేమూరు ఎమ్మెల్యే), కోళ్ల లలితకుమారి (ఎస్.కోట) నామినేషన్ దాఖలు చేయగా... జనసేన నుంచి పులపర్తి రామాంజనేయులు ఒక్కరే బరిలో దిగారు.

బీజేపీ నుంచి విష్ణుకుమార్ రాజు నామినేషన్ వేయగా... బలం లేదని తెలిసీ వైసీపీ నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ వేశారు. వైసీపీకి అసెంబ్లీలో బలం లేకపోవడంతో.... పీఏసీ చైర్మన్ పదవి కూటమి అభ్యర్థినే వరించనుంది. దీనిపై అసెంబ్లీ స్పీకర్ అధికారిక ప్రకటన చేయనున్నారు.

# మూడు నెలల పింఛన్

# ఒకేసారి తీసుకోవచ్చు

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పింఛన్ పంపిణీలో కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఒకరకంగా ఇది పింఛను అందుకుంటున్న వారికి గుడ్ న్యూస్ అని చెప్పాలి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏపీ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వరసగా రెండు నెలలు పింఛను తీసుకోకున్నా మూడో నెల అంతా కలిపి చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా కారణాల వల్ల రెండు నెలలు పింఛను మొత్తాన్ని తీసుకోకపోతే.. ఒకేసారి మూడు నెలలకు కలిపి పింఛను మొత్తాన్ని తీసుకునే వీలు కల్పిస్తూ చంద్రబాబు సర్కార్ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వరసగా మూడు నెలలు వరసగా పింఛను తీసుకోకుంటే మాత్రం వారు వలస వెళ్లినట్లుగా భావించి పింఛను రద్దు చేస్తామని తెలిపింది. కొత్తగా విడుదలయిన ఈ మార్గదర్శకాలు ఈ నెల నుంచే వర్తిస్తాయని తెలిపింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ లో కొత్తగా ఏర్పాటయిన కూటమి ప్రభుత్వం వృద్ధులు, వితంతువులకు నాలుగు వేల రూపాయలకు పెంచింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన మొత్తాన్ని అమలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అరవై ఐదు లక్షల మంది ప్రతి నెల నాలుగు వేల రూపాయల చొప్పున పింఛను మొత్తాన్ని అందుకుంటున్నారు. అదే సమయంలో దివ్యాంగులకు నెలకు ఆరు వేల రూపాయలు ప్రకటించింది. ఏదైనా కారణంతో ఒక నెలలో పింఛను తీసుకోకపోతే రెండో నెలలో రెండు నెలలకు కలిపి పింఛనును అందించనున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు పర్చిన తొలి హామీ పింఛను మాత్రమే. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పింఛను పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గత ప్రభుత్వం వాలంటీర్ల చేత ఇంటింటికి వెళ్లి పింఛను మొత్తాన్ని పంపిణీ చేయించేవారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం గ్రామ, వార్డు సచివాలయం, రెవెన్యూ సిబ్బందితో పింఛను పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి నెల ఒకటోతేదీన ఉదయం ఆరు గంటల నుంచే పింఛను పంపిణీ చేసేలా ఏపీ సర్కార్ చర్యలు తీసుకుంది. దేశంలోనే అత్యధికంగా పింఛను మొత్తం పంపిణీ చేసే రాష్ట్రంగా ఏపీ ఖ్యాతి గడించింది. ఏ రాష్ట్రంలోనూ నెలకు పింఛను నాలుగు వేల రూపాయలు ఇచ్చే పరిస్థితి లేదు. ఒక్క ఏపీలోనే నెలకు నాలుగు వేల రూపాయలు పింఛను మొత్తాన్ని పంపిణీ చేయడంతో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పలు మార్పులు చేస్తుంది

# కిశోర బాలికల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయండి.!

**-బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు. -బాలికల్లో ఉన్నత విద్యా ప్రమాణాలు పెంపొందించండి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 21:
కిశోరి వికాస కార్యక్రమం కింద బాలికల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసి ఉన్నత స్థాయి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీలోని కోపరేటివ్ ఫంక్షన్ హాల్ లో కిషోరి వికాస కార్యక్రమం కింద క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందికి ఇచ్చే జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడి లీలావతి, డిఎల్డిఓ శివ నాగిరెడ్డి, డివిఈఓ సునీత, స్త్రీ శిశు సంక్షేమ అధికారులు, ఎంపీడీవోలు, ఈఓఆర్డీలు, వైద్య సిబ్బంది తదితరులు శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కిషోరి బాలికలకు సరైన విజ్ఞానాన్ని అందించి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసే గురుతర బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో స్త్రీ శిశు సంక్షేమం, వైద్య సిబ్బంది, పంచాయతీ, సచివాలయ వ్యవస్థ తదితర పెద్ద యంత్రాంగం ఉండి బాల్య వివాహాలు నిరోధించడంలో వెనకబడి ఉన్నామన్నారు. బాల్య వివాహాల నియంత్రణలో రాష్ట్రంలో నంద్యాల జిల్లాను రెడ్ మార్క్ చూపించడం బాధాకరమన్నారు. గత నాలుగు నెలల్లో ఒక్క బాల్య వివాహం జరుగుతున్నట్లు క్షేత్రస్థాయి సిబ్బంది నుండి ఎలాంటి సమాచారం లేదని... కలెక్టర్ దృష్టికి వచ్చిన సమాచారంతోనే సిబ్బందిని అప్రమత్తం చేసి బాల వివాహాలను నిరోధించగలిగామంటే సిబ్బంది పనితీరు అర్థమవుతోందన్నారు. పనితీరు మెరుగుపరుచుకుని చిత్తశుద్ధితో విధులు నిర్వహించే పరిస్థితికి రావాలన్నారు. బాల్య వివాహాలు చేయొద్దని ఎంత కౌన్సిలింగ్ ఇచ్చినా వినే పరిస్థితిలో లేని తల్లిదండ్రులు, అత్తమామలపై కేసులు నమోదు చేయడంతో పాటు లక్ష రూపాయల అపరాధ రుసుము విధించే విషయాన్ని ఇదే వేదిక నుంచి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కలెక్టర్ ఆవేదనతో స్పష్టం చేశారు. జిల్లాలో సెక్స్ రేషియో కూడా తక్కువగా ఉందని ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించే పరిస్థితికి వచ్చారని ఇందుకు సంబంధించి పూర్తిస్థాయి అవగాహన తల్లిదండ్రులలో కల్పించాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయ లోపం వల్లే మాతృ, శిశు మరణాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. స్త్రీ శిశు సంక్షేమ, వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీ, బాలింతల విషయంలో అప్రమత్తంగా ఉండి నిత్యం పర్యవేక్షిస్తుండాలని కలెక్టర్ తెలిపారు. యుక్త వయసులో ఉండే అమ్మాయిలకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు తల్లిదండ్రులను ప్రోత్సహించే విధంగా బాధ్యతగా తీసుకొని పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల మానసికంగా, శారీరకంగా సామర్థ్యం ఉండదని తత్ఫలితంగా కుటుంబ కలహాలు, గొడవలకు దారితీసి చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కుబడి రీతిలో విధులు నిర్వహిస్తున్నామన్న రీతిలో కాకుండా అకుంఠిత దీక్షతో విధులు నిర్వహించాలన్నారు. మార్పు అనేది వెంటనే రాదని... నిరంతరాయంగా సమిష్ఠ కృషి చేస్తూ ఉంటే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. హైస్కూలు పిల్లలు సైతం చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం వుందని కలెక్టర్ తెలిపారు. ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ చే మండల స్థాయి ట్రైనర్లు, క్షేత్రస్థాయి సిబ్బందికి సంపూర్ణ శిక్షణ ఇచ్చి గ్రామస్థాయిలో విస్తృతంగా తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఉద్భోదించారు. అనంతరం కిషోర బాలల పరిరక్షణపై ముద్రించిన పుస్తకాన్ని, గోడపత్రికలను కలెక్టర్ ఆవిష్కరించారు.

# చేపల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేస్తాం

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 21:
జిల్లాలో చేపల ఉత్పత్తికి ఉన్నత ప్రమాణాలతో నివేదికలు సమర్పిస్తే నాబార్డుతో అనుసంధానం చేసి మరింత చేపల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రపంచ మత్స్య దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా మత్స్యశాఖ జెడి రాఘవరెడ్డి, బేస్త కుల సంఘ సభ్యులు, మత్స్యకారుల సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజ కుమారి మాట్లాడుతూ జిల్లాలోని 124 చెరువులు, ఐదు రిజర్వాయర్లలో చేపలు ఉత్పత్తి చేస్తున్నాని మరింత పెంపుదల మెరుగుపరచేందుకు ఉన్నత ప్రమాణాలతో నివేదికలు సమర్పిస్తే నాబార్డుతో అనుసంధానం చేసి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. దేశ ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే మత్స్యశాఖ ప్రాముఖ్యత అధికంగా ఉందని రాష్ట్రంలో మన జిల్లా 12వ స్థానంలో ఉందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఆహారపు అలవాటులలో చికెన్, మటన్ లాంటి అనారోగ్య ఆహారపు అలవాట్లలో మార్పు తీసుకువచ్చి ఆరోగ్యాన్ని ప్రసాదించే చేపల వంటకాలు స్వీకరించేలా మత్స్యకార సంఘ నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 45 వేల హెక్టార్లలో 50 వేల మెట్రిక్ టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుందన్నారు. చేపల ప్రాసెసింగ్ చేసే యూనిట్ల స్థాపనకు కృషి చేయాలన్నారు. రకరకాల వంటకాలతో చేపల ఆహార పదార్థాలను సిద్ధం చేసి మార్కెటింగ్ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
జిల్లాలో 71 మత్స్యశాఖ సొసైటీలు ఉన్నాయని ఇందులో తొమ్మిది ఉమెన్ కోఆపరేటివ్ సొసైటీలు కూడా ఉన్నాయని సభ్యులందరికీ చేపల ఉత్పత్తి, వంటకాలపై నైపుణ్యాన్ని ఇంకాస్త మెరుగుపరుచుకొని మెరుగైన జీవన ప్రమాణాలను పెంపొందించుకోవాలని కలెక్టర్ తెలిపారు. చేపల ఉత్పత్తి నిల్వలకు అవసరమయ్యే కోల్డ్ స్టోరేజ్ లను నాబార్డ్ సహాయంతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చేపల ఉత్పత్తికి కార్యాచరణ ప్రణాళిక మాత్రమే కాకుండా వాటిని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రతిరోజు కొంతమేర ప్రగతి సాధిస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. జిల్లాలో చేపల ఉత్పత్తికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

# హజ్ యాత్ర -2025 ఏర్పాట్లపై... మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్ష.!



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 21:
ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్ర-2025కు వెళ్లే యాత్రికులకు సంబంధించి ఏర్పాట్లపై రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్ష చేశారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ పెషీ కార్యాలయంలో సమీక్ష జరిగింది. మదనపల్లె శాసనసభ్యుడు షాజహాన్ పాషా, గుంటూరు శాసనసభ్యుడు నజీర్ అహ్మద్ తోపాటు మైనార్టీ సంక్షేమ శాఖ వివిధ విభాగాల అధిపతులతో హజ్ యాత్ర ఏర్పాట్లకు సంబంధించి మంత్రి ఫరూక్ చర్చించారు. విజయవాడ గన్నవరం ఎయిర్పోర్ట్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నదని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో హజ్ యాత్రకు వెళ్ళే వారి దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి ఫరూక్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికుల కోసం అమలు చేస్తున్న రూ.లక్ష రాయితీ సౌకర్యాన్ని యాత్రికులు సద్వినియోగం చేసుకుకోవాలని పేర్కొన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లపై ఆలస్యానికి తావివ్వకుండా ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ కార్యాచరణ బద్ధంగా చర్యలు చేపట్టాలని మైనార్టీ సంక్షేమ శాఖ వివిధ విభాగాల అధిపతులకు మంత్రి ఆదేశించారు.

# నాణ్యతతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టండి.

**-వచ్చే వారానికి 250 సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కావాలి. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు 21:
పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలలో శంకుస్థాపన చేసి ప్రారంభించిన సిసి రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి 35 సంవత్సరాల పాటు మన్నికగా ఉండేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పంచాయతీరాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిసి రోడ్ల నిర్మాణ పనుల ప్రగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఈఈలు నాగరాజు, రఘురామిరెడ్డి, డిఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే నేపథ్యంలో ప్రారంభించిన సిసి రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి 35 సంవత్సరాల పాటు మన్నికగా వుండి గ్రామస్తులు మెచ్చుకొనే రీతిలో నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లో కలిపి వచ్చే వారానికి 250 సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లాలో 1023 సీసీ రోడ్ల నిర్మాణాలకు గాను 842 గ్రౌండింగ్ కాగా 132 పూర్తి చేశామని వచ్చే వారానికి ప్రగతి కనపడాలన్నారు. సంక్రాంతి పండుగలోపు సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని దృష్టిలో ఉంచుకొని ఆ మేరకు పనుల్లో వేగం పెంచాలన్నారు. సిమెంట్ రోడ్లకు క్యూరింగ్ చేయడంతో పాటు రోడ్ల చివరన ఎత్తు పల్లాలు లేకుండా గ్రావెల్ తో నింపాలన్నారు. ఇంకా ప్రారంభించని సిమెంట్ రోడ్ల నిర్మాణాలు ఈ వారం గ్రౌండింగ్ కావాలని కలెక్టర్ ఆదేశించారు. పాణ్యం, బేతంచెర్ల మండలాలు గ్రౌండింగ్, కంప్లీషన్ లో వెనుకబడి ఉన్నాయన్నారు. చేపట్టిన నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో చక్కగా కనబడుతున్నాయని మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా సిసి రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# విశాఖ నగరంలో న్యాయ విద్యార్థిని అత్యాచారం చేసిన దుండగులను వెంటనే శిక్షించాలి




ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు నవంబర్ 21:
విశాఖ నగరంలో న్యాయ విద్యార్థిని ని ప్రేమ పేరుతో నయవంచన చేసి దారుణంగా అత్యాచారం చేసిన లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ డిమాండ్ చేస్తున్నది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు డి. రామ్ నాయక్, జి. నాగేశ్వరావు లు మాట్లాడుతూఈ ఘటన నాగరిక ప్రపంచాన్ని సిగ్గుతో తలదించుకునేట్లు చేసింది. ఒక లా విద్యార్థిని ఈ అమానుషత్వాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక ఆత్మహత్యకు సిద్ధపడిరదంటే ప్రభుత్వ, పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకం లేని స్థితి కనిపిస్తున్నది. తిరుపతి జిల్లాలో మూడేళ్ళ చిన్నారిని చిదిమేసిన ఘటన మరువకముందే ఈ ఘటన జరగడం దురదృష్టకరం. రాష్ట్రంలో ప్రతిరోజు మహిళలు, పిల్లలపై దాడులు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నా పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం గర్హనీయం. నిందితులకు సరైన శిక్షలు పడకపోవడం, జాప్యం జరగడం వలన మరింత పెట్రేగిపోతున్నారు.
ఈ ఘటనలో బాధిత విద్యార్థినికి, వారి కుటుంబానికి మనోధ్కెర్యం కల్పించే చర్యలు తీసుకోవాలి. అఘాయిత్యం చేసిన దుర్మార్గుల్ని శిక్షించి సత్వర న్యాయం చేసే విధంగా ప్రతేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు పెట్టాలి.అని సిపియం పార్టీ డిమాండ్ చేస్తున్నది. మహిళలు, విద్యార్థులు,సంఘటితపడి ఇలాంటి ఆకృత్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నది.

# రైతులు, కార్మికుల కోర్కెలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 21:
కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 13 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా జిల్లా కేంద్రాలలో నవంబరు 26 దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నంద్యాలలో జరిగే ర్యాలీ నిరసన ధర్నాకు పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఏ ఐ టి యు సి కార్మిక సంఘాల, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నంద్యాల సిపిఐ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య, , రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న లు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ముందు దేశవ్యాప్తంగా కార్మికులు రైతులు పదేళ్ల క్రితం పెట్టిన 15 డిమాండ్లలో ఏ ఒక్క కోర్కెను మోడీ ప్రభుత్వ నెరవేర్చలేదని విమర్శించారు. మధ్య తరగతి ప్రజలు పన్నులు చెల్లించలేక పేదరికంలోకి జారుకుంటున్నట్లు నివేదికలు తెలియజేస్తున్నాయని, రైతులు కార్మికులు మరింత పేదరికంలోకి నెట్టబడడానికి మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలే కారణమని తెలియజేశారు. ఇదే సందర్భంలో కార్పొరేట్లకు 12 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసి ప్రపంచ కుబేరుల స్థానంలో అదానీ, అంబానీలు ఎదగడానికి మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా సహాయపడుతుందన్నారు.
రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని, నిత్యవసర సరుకుల ధరలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులను బానిసత్వం నుండి విడుదల చేయాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజు వేతనం 600 చెల్లించాలని, విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులు నిరుద్యోగులతో తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26 నంద్యాలలో జరిగే కార్మిక కర్షక ఐక్య ధర్నాలో పెద్దసంఖ్యలో నిరుద్యోగులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ, నంద్యాల సిటీ అధ్యక్ష కార్యదర్శులు బి శ్రీనివాసులు డి శ్రీనివాసులు, ఏ ఐ టి యు సి నాయకులు బాల సంజీవులు, ఆనంద్, పీఎం రమేష్ ,సుశీలమ్మ, రవి ,వేదవతి ,రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విద్యార్థిపై జరిగిన సామూహిక అత్యాచారంనీ తీవ్రంగా ఖండిస్తున్నాం.

**-పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు 21:
లా విద్యార్థిని పై విశాఖపట్నం నాలుగురు కామాంధులు పైచచ్చికత్వనికి బలైన మరో విద్యార్థి నీ రాష్ట్రములో విపరీతంగా అరాచకలు అత్యాచారాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.పసి పిల్లలు నుండి పండు ముసలి వరకు వదలకుండా ఎదో ఒక చోట మానవత విలువ కోల్పోయి దారుణలకు వడికడుతున్నారు.ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు చెప్పటాలి నిర్భయ, దిశ, లాంటి చట్టాలను పటిష్టం చేయాలి సమాజంలో సినిమా ప్రభావం ఎక్కువ ఉంటుంది అసభ్యకరమైన సన్నివేశాలు నీలి చిత్రాలు సోషల్ మీడియా నియంత్రణ లేకపోవడం విపరీతంగా మద్యం, మత్తు పదార్థాలను యాదేచ్ఛగా విక్రయించడం వీటివల్ల మనిషి విచక్షణ కోల్పోయి ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విశాఖపట్నంలో లా విద్యార్థిపై జరిగిన ఘటనలో నిందితులకు కఠినమైన శిక్ష అమలు చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# యురేనియం తవ్వకాల కోసం వేసే టెండర్లను రద్దు చేయాలి.

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు,




ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 21: నంద్యాల జిల్లా లో డోన్ నియోజకవర్గం ప్యాపలి మండలం లో జక్కసాని కుంట్ల, మామిళ్ళపల్లి, రాంపురం యురేనియం తవ్వకాల కోసం వేసే టెండలను రద్దు చేయాలగ్రామాల్లో యురేనియం త్రవ్వకాల కోసం వేసే టెండర్ల ను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు ఒక ప్రకటన లో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్యంత వెనుక బడిన కరువు జిల్లాల్లో అత్యల్ప వర్ష పాతం వల్లరైతులకు పంటలు పండకుండా ప్రతి ఏటా సుదూర ప్రాంతాలకు పేద రైతులు, వ్యవసాయకూలీలు వలసలు పొట్ట చేత బట్టుకొని వెళుతున్న ఈ ప్రాంతాల్లో రైతుల పొలాలకు సాగునీరు అందించి రైతుల ను, వ్యవసాయకూలీలను ఆదుకోవడానికి శాశ్వత కరువునుపారద్రోలడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయవలసింది పోయి కరువు ప్రాంతాల్లో యూరేనియం త్రవ్వకాలు చేపట్టి ప్రజల, జంతువుల జీవనాన్ని దెబ్బతీసి, వాతావరణాన్నే కలుషితం చేసే చర్యలు చేపట్టడానికి పూనుకోవడం చాలా దారుణం. ఈ త్రవ్వకాలవల్ల కడప జిల్లా పులివెందుల ప్రాంతంలో తుమ్మల పల్లి చుట్టుపక్కల ప్రజలు నరకప్రాయమైన జీవితాలను గడుపుతున్నారు. కర్నూలు జిల్లా కప్పట్రాల్ల చుట్టుప్రక్కల ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించడం తో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్రవ్వకాలను నిలిపి వేశారు.డోన్ శాసన సభ్యులు, జిల్లా మంత్రులు కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లి అత్యంత ప్రమాద కరమైన యురేనియం త్రవ్వకాల టెండర్ల ను రద్దు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు..

# క్లిష్టమైన ప్రసవాల నిర్వహణపై వైద్య సదస్సు




ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 21:

నంద్యాల ఐ.ఎం.ఎ అనుబంధ విభాగం మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో స్థానిక మధు మణి ఆసుపత్రి సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు " క్లిష్టమైన ప్రసవాలు- ఎదుర్కొనే సమస్యలు- అనుసరించాల్సిన నూతన వైద్య విధానాలు" అన్న అంశంపై వైద్య సదస్సు నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు అధ్యక్షతన, మిషన్ పింక్ హెల్త్ రాష్ట్ర శాఖ కార్యదర్శి, లైఫ్ హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ లక్ష్మీ సౌజన్య నిర్వహణలో జరిగిన సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని సదస్సు ప్రారంభించారు.గర్భిణీ స్త్రీలలో పచ్చకామెర్లు, థైరాయిడ్ సమస్యలు, తలసీమియా తదితర సమస్యలు ఉన్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చేయవలసిన పరీక్షలు, అందించవలసిన వైద్య విధానం గురించి లైఫ్ హాస్పిటల్ లో స్త్రీ వ్యాధి నిపుణులుగా పని చేస్తున్న డాక్టర్ హేమలత, డాక్టర్ పుష్పలత, డాక్టర్ సుష్మ, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ మధువాణి, డాక్టర్ స్రవంతి మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ మహిళా విభాగం నాయకులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద, డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ కల్పన, డాక్టర్ అరుణకుమారి,డాక్టర్ సుష్మ అధిక సంఖ్యలో వైద్యులు పాల్గొన్నారు.

# ముదురుతున్న రామ్ చరణ్ దర్గా వివాదం..

## క్షమాపణకు అయ్యప్ప స్వాములు డిమాండ్

హైదరాబాద్,ఆంధ్ర ప్రగతినవంబర్ 21:

అయ్యప్ప మాలధారణ వేసిన సినీ నటుడు రామ్ చరణ్ తేజ్ దర్గాను సందర్శించడం తీవ్ర దుమారం రేపుతోంది. మాలలో ఉండీ ఉర్సు ఉత్సవాల్లో ఎలా పాల్గొంటారని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదంపై హిందూ సంఘాలు తప్పుబడుతున్నాయి. చెర్రీ సతీమణి ఉపాసన దానిపై వివరణ ఇచ్చినా కూడా రామ్ చరణ్ క్షమాపణ చెప్పాల్సిందేనని అయ్యప్పస్వామి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మాల నియమాలకు విరుద్ధంగా వ్యవహరించిన రామ్ చరణ్ క్షమాపణ చెప్పాలని కోరుతున్నాయి.కడప నగరంలోని అమీన్‌పూర్ పెద్ద దర్గా ఉర్సు వేడుకల్లో రామ్ చరణ్ పాల్గొనడం.. అక్కడ ప్రార్థనలు చేయడం తీవ్ర దుమారానికి తెర రేపింది. అయ్యప్ప మాల వేసుకున్న స్వాములు రామ్ చరణ్ దర్గా సందర్శనను తప్పుబడుతున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విలేకరుల సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు గాంధీ కృష్ణ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. 'అయ్యప్ప మాలధారణలో ఉండి అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మెగా హీరో రామ్ చరణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. పవిత్రమైన అయ్యప్ప మాల ధరించి మాల నియమాలకు విరుద్ధంగా బొట్టును తొలగించడమే కాకుండా దర్గాను సందర్శించడం ధర్మానికి విరుద్ధమని స్పష్టం చేశారు. ధర్మాన్ని కాపాడతానంటూ ఓవైపు ఏపీ డిప్యూటీ సీఎం, రామ్ చరణ్ బాబాయి పవన్ కల్యాణ్ శ్రమిస్తుంటే అదే కుటుంబంలో జన్మించిన రామ్ చరణ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విచారకరమని పేర్కొన్నారు. రామ్‌చరణ్ బేషరత్‌గా అయ్యప్ప భక్తులకు, యావత్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్ధృతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# తిరుమలలో భవనాలకు మేమిచ్చే పేర్లనే పెట్టాలి

## టిటిడి ఈవో శ్యామల రావు వెల్లడి

తిరుమల,ఆంధ్ర ప్రగతి నవంబర్ 21:

తిరుమలలో నిర్మించిన భవనాలకు సొంత పేర్లను వినియోగించడానికి వీలు లేదని టిటిడి ఈవో శ్యామల రావు తెలిపారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2019లో తిరుమల అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించిన అది జరగలేదన్నారు. తిరుమల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు మాస్టర్ ప్లాన్ ను అమలు చేయాలన్నారని తెలిపారు. 2019లో రూపొందించిన మాస్టర్ ప్లాన్ గురించి ఎవరికి తెలియని పరిస్థితి నెలకొందని శ్యామలరావు తెలిపారు. ఒక ప్లాన్ ప్రకారం తిరుమల అభివృద్ధి జరగలేదని ఈవో శ్యామలరావు తెలిపారు. చారిత్రాత్మక చరిత్ర ఉట్టిపడేలా నిర్మాణాలు నగరంలో జరగడం లేదని ఆయన అన్నారు. పవిత్రత అనేది లేకుండా భవన నిర్మాణాలు చేశారన్న శ్యామలరావు తిరుమలలో కట్టిన నిర్మాణాలు సొంత పేర్లు ఉండకూడదన్నారు.

# అడవి బిడ్డలకు రాజ మార్గం( రోడ్డు )కోసం

# ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కృషి

**-కపిలేశ్వరం నుంచి జనాలగూడెం వరకు తారు రోడ్డు నిర్మాణం కోసం రూ. 4.40 కోట్లు మంజూరు చేయించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 21: శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన, సారవంతమైన వ్యవసాయ భూములు, ఇల్లు త్యాగం చేసి సర్వం కోల్పోయి నల్లమల అరణ్యంలో కనీస వసతులకు దూరంగా జీవిస్తున్న అడవి బిడ్డలకు కనీసం రోడ్డు మార్గం ఏర్పాటు చేసి, రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు ప్రసరింప జేసీ చీకట్లో మగ్గుతున్న ఆ గ్రామాలకు బయటి ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు, విద్యుత్ సరఫరా కోసం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి శ్రామిస్తున్నారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం నల్లమల అరణ్యంలో బయటి ప్రపంచానికి దూరంగా బ్రతుకుతున్న బలపాలతిప్ప, జానాలచెంచు గూడెం, సిద్దేశ్వరం, కపిలేశ్వరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా రూ 50 లక్షలు, తారు రోడ్డు నిర్మాణం కోసం రూ. 4.40 కోట్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంజూరు చేయించారు. కపిలేశ్వరం గ్రామం నుంచి సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వరకు 7.10 కిలోమీటర్లు దూరం వరకు 7.30 మీటర్ల వెడల్పుతో మెటల్ రోడ్డు, వాటిపై 3.75 మీటర్ల వెడల్పుతో బి టీ (తారు ) రోడ్డు నిర్మాణం కోసం, రోడ్డు ప్రక్కన విద్యుత్ స్థంబాలు, విద్యుత్ దీపాలు వేసేందుకు ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రధానమంత్రి జనజాతీ ఆదివాసిన్యాయ్ మహా అభియాన్ పథకం ద్వారా, ట్రైబల్ గ్రూప్ ఆధ్వర్యంలో తారు రోడ్డుకు 4.40 కోట్ల రూపాయలు, విద్యుత్ సరఫరాకు 50 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు.

# ఘనంగా సీనియర్స్ కబడ్డీ బాలుర మరియు బాలికల ఎంపిక పోటీలు






ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 21: నంద్యాల పట్టణంలోని ప్రధమనంది దేవాలయం చామకాలువ దగ్గర ఉమ్మడి కర్నూల్ మరియు నంద్యాల సీనియర్ కబడ్డీ పోటీలు బాలుర మరియు బాలికల ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించడం అయినది ఈ కార్యక్రమం ఉమ్మడి కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ మరియు ఏపీ రెడ్డి వారి ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభించడం అయినది మరియు విశిష్ట అతిథులుగా నంద్యాల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు సి వి చలం బాబు మరియు ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీ నిమ్మకాయల సుధాకర్ గారు నంద్యాల జిల్లా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎం ఎన్ వి రాజు ఎంఈఓ సుబ్రమణ్యం నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండె నాగరాజు 19వ వార్డు టిడిపి ఇంచార్జ్ షేక్ మున్నా శివరాం రెడ్డి రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు దివాకర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారులకు జిల్లాస్థాయిలో మంచి ప్రతిభ చూపి మన ఉమ్మడి కర్నూల్ మరియు నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సెలక్షన్ కమిటీ సభ్యులు సభ్యులు నాగన్న భరత్ రెడ్డి సురేష్ నాయుడు శ్రీనివాసులు రామేశ్వర్ రెడ్డి కిషోర్ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాబబుల్స్ టీమును ఎంపిక చేయడమైనది అనంతరం కబడి అసోసియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి గారు మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి ఇక్కడ సెలెక్ట్ అయిన టీములకు కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తామని సభా పూర్వకంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో గోపికృష్ణ నాయక్ హరికృష్ణ మహబూబ్బాషా సుధాకర్ కుబేర్ దేవేంద్ర గౌడ్ అస్లాం భాష రవికుమార్ 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

# మహానందిలో భక్తుల జేబుకు చిల్లు

## -స్వామివారి తలనీలాలలో భక్తులకు గుండు.






ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 21:

మహానంది క్షేత్రంలో ఒక వింత ఆచారానికి తెర లేపినట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. క్షేత్రంలో పుట్టు వెంట్రుకలు తీయించుకోవాలంటే 1000 రూపాయలు, సాధారణ గుండు గీయించుకోవాలంటే వంద రూపాయలు పై మాటే గా గత కొన్ని రోజుల నుంచి కొనసాగుతున్నట్లు భక్తుల నుండి విమర్శలు వెలువెత్తుతున్నాయి. స్వామి అమ్మవార్ల మీద భక్తి విశ్వాసాలతో తలనీలాలు క్షేత్రంలో సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. మహానంది క్షేత్రంలో తలనీలాలు సమర్పించుకోవడానికి 25 రూపాయలు చెల్లించి టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. తలనీలాలు సమర్పించిన అనంతరం భక్తులు కానుకల రూపంలో లేదా ఇతరత్రా రూపంలో భక్తి భావంతో సమర్పిస్తే తీసుకోవాలి తప్ప కాదు కూడదని డిమాండ్ చేయడం ఎంతవరకు సబబు అని భక్తులు ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు విచారణ జరిపిస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోనికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

# ఆళ్లగడ్డలో ఘనంగా వరల్డ్ టెలివిజన్ డే వేడుకలు.



ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ నవంబర్ 21: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో గురువారం వరల్డ్ టెలివిజన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.పట్టణ టి.వి మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి మదర్ హెూమ్ లో విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు, ప్యాడ్స్ ను అసోసియేషన్ సభ్యులు పంపిణీ చేశారు.

పిల్లలకు భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టివి మెకానిక్ ట్రేడ్ యూనియన్ కార్యవర్గ సభ్యులు ట్రెజరర్ రామకృష్ణ ట్రెజరరు మున్నా మాట్లాడుతూ స్ఫూర్తి మదర్ హెూం పిల్లల నడుమ టెలివిజన్ డే వేడుకలను జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వం టి.వి మెకానిక్ లను కార్మికులుగా గుర్తించాలని వారు సూచించారు. ప్రభుత్వ పరమైన ప్రయోజనాలను అన్నింటిని టి.వి మెకానిక్ లకు కూడా కల్పించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు ఆళ్లగడ్డ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలకృష్ణ,వైస్ ప్రెసిడెంట్ పల్లా ప్రభాకర్,సెక్రటరీ షరీఫ్, ట్రెజరరు మున్నా, గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు,గౌరవ సలహాదారు మాణ్యం,మరియు అసోసియేషన్ సభ్యులు శ్రీను,అక్బర్, శివ,లింగేశ్వర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.